కథ

# హద్దు

ఎ. ప్రభాకర్

(గత సంచిక తరువాయి)

కలెక్టరు లేచాడు. అతను మహారాష్ట్ర వాడు. ఎక్కువగా ఇంగ్లీషు మాట్లాడుతాడు. తెలుగు ముద్దగా మాట్టాడుతున్నాడు.

"అందరికీ నమస్కారం... ఈ ప్రాజెక్టు గురించి మీకు వుండిన అపోహల్ని తీసేందుకు ఈ మీటింగ్ ఏర్పాటు చేసారు. మొట్టమొదట ఒక విషయం చెప్పాలి. ఈ ప్రాజెక్టు ఈ ప్రాంతంలో నిర్మించడం మన అదృష్టం. దీని వల్ల చాలా లాభాలున్నాయి. ముఖ్యంగా ఈ ప్రాంతంలోని యువకులకి ఉద్యోగాలు బాగా దొరుకుతాయి. దేశంలోనే ప్రధానమైన ప్రాంతంగా యిది ఉంటుంది. ఈ వేళ ప్రపంచం అంతా కంప్యూటర్లు, మోడ్రన్ టెక్నాలజీతో ముందుకు దూసుకుపోతోంది. మనం కూడా డెవలప్ కావాలంటే ఇది తప్ప మరో మార్గం లేదు. దీనివల్ల విదేశీ మారకద్రవ్యం వస్తుంది. యింత పెద్ద ప్రాజెక్టుని బర్డ్స్ పోతాయని వద్దనడం... నాకు చాలా ఆశ్చర్యం వేస్తుంది. యింత వెనుకబడిన ఆలోచనలు చేసేవాళ్లు యింకా ఉన్నారా? బర్డ్స్ కోసం మన అభివృద్ధిని ఆపుకుంటామా? ఈ మైండ్‌సెట్‌ని మనం మార్చుకోవాలి. అభివృద్ధి సాధించడం తప్ప మనం యింకో దానికోసం ఆలోచించకూడదు. దానికోసం ఏమైనా చేయాలి... ఎందుకంటే అభివృద్ధి సాధించడం ఒక్కటే ఈ వేళ మనుషులు చేయాల్సిన పని..." అని మాట్లాడాడు.

జనంలో కలకలం రేగిపోయింది.

పట్టణ ప్రాంతం నించి వచ్చిన ఇంజనీరింగ్ కుర్రాళ్లు 'అభివృద్ధి నిరోధకులు నశించాలి' అంటూ నినాదాలు చేస్తున్నారు. ఉందులోంచి ఒక కుర్రాడు ముందుకొచ్చి మైకు దగ్గరకెళ్లాడు.

"అసలు ఏంటండీ ఈ అభిప్రాయ సేకరణ. దీనంత నాన్సెన్స్ ఇంకేమయినా ఉందా? వేలాదిమందికి ఉద్యోగాలు లభించే ప్రాజెక్టుల్ని వ్యతిరేకించడం ఎంత మూర్ఖత్వమో తెలుసా? చదువుకున్న మాలాంటి యువకులు చిప్ప చేత్తో పట్టుకుని రోడ్డుమీద తిరగాలా? దేశాభివృద్ధి ఆధారపడి ఉన్న యిలాంటి ప్రాజెక్టుల్ని నిర్మించడంలో ప్రభుత్వం కఠినంగా ఉండాలి. అభివృద్ధి నిరోధకుల్ని అణిచి పారెయ్యాలని యువతరం తరపున ప్రభుత్వానికీ, మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను" అని దిగాడు.

మంత్రి ఎమ్మెల్యేలు కూల్‌డ్రింకు తాగుతూ బూరయ్య వంక చూసీ చూసీ చూడనట్టే చూసారు. బూరయ్య నిశ్శబ్దంగా కూర్చుని వింటున్నాడు. పట్టణం నించి వచ్చిన కాలేజీ లెక్చరర్, పర్యావరణ శాస్త్రవేత్త లేచివెళ్ళాడు.

"మన కలెక్టర్‌గారు, మంత్రిగారు చెప్పింది విన్నాం. విద్యార్థి మిత్రుడి ఆవేదన్ని అర్థం చేసుకుందాం. ఒక పర్యావరణ శాస్త్రవేత్తగా నా అభిప్రాయం ఏమంటే మొదటగా ఒక విషయం స్పష్టం చేయాలి. మేము అభివృద్ధికి వ్యతిరేకులం కాదు. దేశం అభివృద్ధి కావడం, దేశంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి కావడం మనక్కావాలి. అయితే అందుకోసం పర్యావరణాన్ని నాశనం చేసే దాన్ని సాధ్యమైనంత తగ్గించుకోవాలి. కాలుష్యాన్ని నివారించుకునేందుకు ఇవాళ అద్భుతమైన టెక్నాలజీ ఉంది. దాన్ని వినియోగించుకోవాలి. యిక ఈ ప్రాజెక్టు విషయానికొస్తే మొట్టమొదట ఒక విషయం స్పష్టం చేస్తున్నా. నేను ఈ ప్రాజెక్టుకి వ్యతిరేకం కాదు. ఇది మనం పోరాడి సాధించుకున్నది. ఇది ఇక్కడే కట్టి తీరాల్సిందే".

కిందనించి చప్పట్లు. "అయితే ఈ ప్రాంత ప్రజలు ప్రాణాధికంగా ప్రేమించే పక్షుల గురించి. నిజమే పక్షుల్ని ప్రేమించాల్సిందే. ఈ ప్రాజెక్టు వల్ల పక్షులు పోతాయనేదీ నిజమే. అయితే దాన్ని నివారించుకోవచ్చు. దాని కోసం ప్రాజెక్టుని ఆపేయక్కర్లేదు. నిపుణుల్ని సంప్రదించి తగిన నివారణోపాయాల్ని కనుగొని పక్షులకి పునరావాసం... శాంక్చువరీలని ఏర్పాటు చేయడం అంత కష్టమైన పని కాదు. కాబట్టి ప్రజల్ని ఈ అంశమ్మీద పోరాడాల్సిందిగా కోరుతున్నాను. అంతే తప్ప ప్రాజెక్టుల్ని వ్యతిరేకించడం సరైంది కాదు".

వెంటనే మంత్రి లేచాడు.

"మాస్టారు చెప్పింది చాలా సరైన ఆలోచన. నేనిప్పుడే హామీ యిస్తున్నాను. పక్షుల సంరక్షణ కోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తాం. ఆ కమిటీ పర్యవేక్షణలో పక్షుల పునరావాసం కోసం ఎంత ఖర్చుకైనా వెనకాడమని తెలియచేస్తున్నాను" అని కూర్చున్నాడు.

గ్రామాల నించి వచ్చిన వాళ్లందరిలోనూ ఆందోళన కనిపిస్తోంది. అధికారులగ్గానీ, నాయకులగ్గానీ, పట్నం నించి వొచ్చిన కుర్రాళ్లగ్గానీ ఎవ్వరికీ వినే వోపిక ఉన్నట్టు లేదు. అంతా ముందే అనుకుని వచ్చినట్టుగా ఉంది. మేం చెప్పేదానికి మీరు ఒప్పుకుని తీరాలని మాట్లాడుతున్నారు పైగా లేనిపోని సెంటిమెంట్లు, ఆవేశాల్ని రెచ్చగొడుతున్నట్టుగా మాట్లాడుతున్నారు.

బూరయ్య లేచి మైకు దగ్గర కెళ్లాడు. అతని గురించి అందరికీ ముందే తెలుసు. దాంతో అతనేమంటాడో అన్నట్టు అందరూ నిశ్శబ్దమైపోయారు. బూరయ్య మైకు ముందు నిలబడి అందర్నీ తేరిపార చూసాడు.


"ఈ భూగోళమ్మీద బతకడానికి మనిషికెంత హక్కుందో ప్రతి జీవికీ అంతే హక్కుంది. ప్రకృతి నిర్దేశించిన ఆహారం కోసం తప్ప జీవుల్ని సమూలంగా నాశనం చేసే అధికారంగానీ, అహంకారంగానీ ఏ జీవికీలేదు. మనిషికి కూడా. భూమ్మీద బతకడానికి మనిషికి విస్తారమైన అవకాశంఉంది. తనకున్న

మేం అభివృద్ధి నిరోధకులమే. పర్యావరణాన్నీ, జీవావరణాన్ని నాశనం చేసి ఒకరో ఇద్దరో సేట్లు అభివృద్ధి సాధించి ప్రపంచ కుబేరుల లిస్టులో చోటు చేసుకుంటే అహా! అని అబ్బురపడలేం. అలాంటి అభివృద్ధికి ఖచ్చితంగా వ్యతిరేకులమే.



ప్రత్యేకమైన శారీరక మానసిక లక్షణాల వల్ల మనిషి భూమ్మీద ఒక ప్రత్యేకమైన జీవిగా అవతరించాడు. మిగతా జీవులు, ప్రకృతి, అడవులు, కొండలు, గుట్టలు, గాలి, నీరు, నిప్పు, ఆకాశం యావద్భూగోళపు ఉనికినే మానవుడు నిర్దేశించే స్థాయికి పెరిగాడు. అతడు ఒక జీవిని ఉంచాలంటే ఉంచగలడు. నాశనం చేయాలంటే చేయగలడు.

కానీ మనిషి దేన్నీ ఉంచాలనుకోవడం లేదు. అన్నింటినీ నాశనం చెయ్యాలనుకుంటున్నాడు. ఒకవేళ దేన్నయినా ఉండాలని అనుకున్నాడంటే అది లేకపోవడం తనకు ప్రమాదమేమో అనే



***అరవై ఏళ్లు పైబడిన వ్యక్తి అతను. ఎప్పుడూ తెల్లబట్టలు వేసుకుని ఉంటాడు. అవి చాగల్నాడు ఎర్రమట్టిని అంటించుకుని ఉంటాయి. బక్కగానే ఉంటాడు. కానీ శక్తివంతంగా ఉంటాడు. నల్లని అతని శరీరంమీద తెల్లవెంట్రుకలు గుబురుగా ఉంటాయి. అతని ముఖం చిత్రంగా పసిపాపలా ఉంటుంది.***

అనుమానంతోనే. ఈ ప్రమాదం గతంలో కన్నా యివ్వాళ విపరీతంగా పెరిగిపోయింది. ఏ పని చేసినా దాన్ని భూమి క్షమించే స్థితి దాటిపోయింది. మానవుడి అర్థం పర్థం లేని పనుల వల్ల యిప్పటికే వేల రకాల పక్షులు నశించాయి. జంతువులు నశించాయి. అడవులు నశించాయి. గాలి- నీరు- ఆకాశం- భూమి- అన్నీ కలుషితమైపోయాయి. ప్రకృతి ఒక వ్యాపార సరుకుగా, మానవుడు ఒక వినియోగదారుడుగా భావించుకోవడం వల్ల వచ్చిన భయంకర పరిణామమిది. మనిషికి విజ్ఞత ఉంది. ప్రకృతితో ప్రేమ పూర్వకమైన జీవనాన్ని గడపాల్సిన అవసరం ఉంది.

ఇక ప్రస్తుత విషయానికొస్తే ఈ ప్రాజెక్టు వల్ల వేలాది ఉద్యోగాలు వస్తాయని గౌరవనీయులైన కలెక్టరుగారంటున్నారు. ఒక్కటంటే ఒక్క ఉద్యోగం పేరు చెప్పగలరా? లక్షల రూపాయలు జీతాలు తీసుకునే ఒకటో రెండో ఉద్యోగాల సంగతలా ఉంచితే ఇక్కడి కుర్రాళ్ల సంగతేంటి. ఇక్కడ భూమ్మీద రైతులుగా... గౌరవంగా జీవించే కుర్రాళ్లని మీ ప్రాజెక్టులో కూలీలుగా మారుస్తారు. ఆ పని అయిపోయాకా వాళ్లని యిక్కడి నించి గెంటేస్తారు. ఇతర రాష్ట్రాలనించి ఇంజనీర్లని నిపుణులనీ తీసుకొస్తారు. ఏంటి ఈ వూళ్లకి ఒరిగేది? మన పర్యావరణవేత్తగారు పునరావాసం అంటున్నారు. మనుషులనే పునరావాసం కావాలని అడిగినందుకు వారిని అభివృద్ధి నిరోధకులుగానూ, దేశద్రోహులుగానూ చూస్తున్న ఈ కాలంలో పక్షులకి పునరావాసం కల్పిస్తారా? అవి ఉంటే ఏంటి చస్తే ఏంటి అని నిర్లక్ష్యంగా వెటకారంగా మాట్లాడిన అధికారులు వాటికోసం కమిటీలు వేసి వాటిని రక్షిస్తారా? ఇదెంత అర్థంలేని విషయం? మనుషులకే పునరావాసానికి దిక్కులేదు. ఇక పక్షులకి... కల్పిస్తే మనుషుల్లా వెళ్లిపోతాయా అవి? ఒక జీవికి అది బతకగలిగే పరిస్థితులు ఉంటాయి. ఈ భూగోళం మీద వలస వెళ్లే పక్షులు నివసించే ప్రాంతాలు భగవంతుడి అపూర్వ సృష్టి. దాన్ని నాశనం చేస్తే పక్షులు వస్తాయి గానీ బుద్ధిగా వెళ్లి కూర్చుంటాయా? ఈ భూగోళమ్మీద మనం చంటిపిల్లల్లా చూసుకోవాల్సిన ప్రాంతాలున్నాయి. సహజమైన సరస్సులు- అద్భుతమైన కొండలు- గుహలు- నదులు- సముద్రాలు- అడవులు- జలపాతాలు... యిలా వలస పక్షులు వాలే ప్రదేశాలు. వీటికి హాని కలిగించే ఎలాంటి పనినీ మనిషి చెయ్యకూడదు. అది మనిషి కనీస ధర్మం. కనీస విచక్షణ. మంత్రిగారు మమ్మల్ని అభివృద్ధి నిరోధకులమన్నారు. అవును! మేం అభివృద్ధి నిరోధకులమే. పర్యావరణాన్నీ, జీవావరణాన్నీ నాశనం చేసి ఒకరో ఇద్దరో సేట్లు అభివృద్ధి సాధించి ప్రపంచ కుబేరుల లిస్టులో చోటు చేసుకుంటే అహా! అని అబ్బురపడలేం. అలాంటి అభివృద్ధికి ఖచ్చితంగా వ్యతిరేకులమే.

ఒక మానవత్వపు అంశాన్ని సానుకూలంగా- సాకల్యంగా- ప్రేమపూర్వకంగా- ప్రత్యామ్నాయ శోధకంగా పరిశీలించడం మాని దాన్నొక రాజకీయ ఎత్తుగడగా మార్చివేశారు. మీరు బలవంతాన ఊళ్లకి ఊళ్లని ఖాళీ చేయించి ప్రాజెక్టులు కట్టి అభివృద్ధి చెందిపోతారు. కానీ మేం మాత్రం అడ్డుకుంటాం. ఇంకోచోట కట్టండి ప్రాజెక్టుని. అటువంటి ప్రాంతాలు మన దేశంలోనూ జిల్లాలోనూ చాలా ఉన్నాయి. అక్కడ కట్టవచ్చు ప్రాజెక్టుల్ని. పట్టుబట్టి బలప్రయోగం చేసి ఒకానొక భౌగోళిక అద్భుతాన్ని నాశనం చేయవద్దని సవినయంగా మనవి చేస్తున్నాను".

కింద జనంలో కలకలం రేగిపోయింది. మంత్రిగారి మనుషులు మా మంత్రిని విమర్శిస్తారా అంటూ అరుస్తున్నారు. పట్నం కుర్రాళ్లు మైండ్ లెస్ బ్రూట్ అంటున్నారు. గాలి స్తంభించి పోయిందా అన్నట్టున్న ఉద్రిక్తత. ఈలోగా పట్నం కుర్రాళ్లు బూరయ్య మాటలకి చప్పట్లు కొడుతున్న ఇద్దరు కుర్రాళ్లని కొట్టారు. అంతే తన్నులాటలు తోపులాటలు మొదలైపోయాయి. స్టేజీమీదున్న కలెక్టరు మంత్రి, యితర అధికారులు గబగబా కార్ల దగ్గరకెళ్లి ఎక్కేసారు. పోలీసులు లాఠీఛార్జీ చైడం మొదలుపెట్టారు. దొరికిన వాళ్లని దొరికినట్టు బాదేస్తున్నారు. అందరూ పరుగులు తీస్తూ పొలాల్లోకి వూర్లోకి పారిపోయారు. బూరయ్యనీ, ఆదినారాయణ, సోమరాజు, ఇంకా ఇరవైమంది వరకూ యువకుల్ని అరెస్టు చేసి వేన్ ఎక్కించుకుని తీసుకుపోయారు.

**5**

మంత్రి రామచంద్రరావుకి ఒళ్లంతా కారం రాసుకున్నట్టు ఉంది. ఆర్థికంగా- రాజకీయంగా పైపైకి ఎదిగిపోవడానికి తనేసుకున్న ప్రణాళికంతా భగ్నం అయిపోయింది. ఒకటా రెండా దగ్గర దగ్గర పాతిక ముప్పై కోట్లు! జాతీయస్థాయి ప్రాజెక్టుని జిల్లాకు తెచ్చిన ఖ్యాతి... దానివల్ల వచ్చే రాజకీయ ప్రయోజనం...

ప్రజాభిప్రాయ సమావేశాల్ని జాగ్రత్తగా ప్లాన్ చేసి ప్రజల్ని సులువుగా మలిచేయవచ్చని అనుకున్నాడు. కానీ సమావేశంలో లాఠీ ఛార్జీ జరగడం- బూరయ్యని అరెస్టు చేయడంతో అంతా కంపు కంపైపోయింది. అప్పటికి వెంటనే ఎస్పీకి ఫోన్ చేసి అరిచాడు. 'అసలు బూరయ్యగారిని ఎందుకు అరెస్టు చేసారు? వెంటనే వదిలేయండని' కానీ పోలీసులు వూరుకుంటారా... కేసులు పెట్టి మరీ వదిలారు. అప్పటికే జరగాల్సింది జరిగిపోయింది. పేపర్లో వార్తలు రావడంతో జిల్లాలోనూ, దేశంలోనూ, విదేశాల్లో కూడా దీనిమీద నిరసన కనిపిస్తోంది. పక్షులు నాశనమైపోతాయి అనేది సెంటిమెంటులా పనిచేస్తోంది.

టీపాయి మీదున్న పేపరు వంక చూసాడు. చింతచెట్టు చిటారు కొమ్మమీద రెండు కొంగలు సగం కళ్లతో చూస్తున్నాయి. ఇంకో కొంగ రెక్కల్ని చాచే ఉండి కొమ్మమీద ఒక కాలు పెట్టింది. అది పైకెగురుతోందో... వాలుతోందో...అతనికి తన చిన్నతనం గుర్తొచ్చింది. బళ్లోకెళ్తూ ఈ కొంగల్ని ఆకాశంలో చూసి చేతులు సాచి 'కొంగా గుడ్డెట్టూ...' అంటూ తలపైకే ఉంచి పరుగులు పెట్టేవారు. ఒకసారి ఒక కొంగ పిల్ల పడిపోతే దాన్నెంత అబ్బురంగా చూసారో...

ఈ జ్ఞాపకాలన్నీ వొచ్చి మనసు మరీ చిరాకైపోయింది.

ఈ ప్రాజెక్టు గురించి ఆలోచించినప్పుడు అసలు ఈ పక్షుల్ని గురించి తల్చుకోలేదు. వూరు రాజమండ్రికి దగ్గరగా ఉంది. పక్కన గోదావరి

ఉంది. నీటికి కరువు లేదు. కాస్తంత దూరంలో జాతీయ రహదారి ఉంది. వూళ్ళో కావలసినంత స్థలం ఉంది. అవసరమైతే చెరువు పూడ్పించేయచ్చు... యిలాటి ఆలోచనలు చేసారు. ప్రాజెక్టు కంట్రాక్టులు తన వర్గానికి యిప్పించుకోవడం- ఆ చుట్టుపక్కల భూముల్ని కొనిపించి రియల్ ఎస్టేట్ చేయించడం లాంటి పనులన్నీ నల్లేరు మీద బండి నడకలా చేయించేసాడు.

పాతిక కోట్లు! మళ్ళీ దొరుకుతుందా ఛాన్సు!

అది కాక యిప్పుడు యిరుక్కుపోయాడు. వెనక్కి తిరగడానికి లేదు. ఈ ప్రాజెక్టుతోనే తన రాజకీయ భవిష్యత్తు ముడిపడి పోయింది. పైగా యిదేమో ఫారిన్ కంపెనీలతో ముడిపడున్న వ్యవహారం.

పేపర్లోంచి కొంగ వచ్చి వొళ్ళో వాలినట్టనిపించింది. వూరి చెరువు దగ్గరకెళ్లి చెట్ల చాటున బోర్లా పడుకుని కొంగల్ని గంటల తరబడి చూట్టం గుర్తొచ్చింది. వడ్రంగి పిట్టలు, పాలపిట్టలు, పిచ్చుకలు, కత్తెర పిట్టలు, కోయిళ్లు, చిలకలు, మిణుగురులు... ఏమైపోయాయివన్నీ...!

పొలాల్లోకెళ్తే చాలు ఈ పక్షుల కిలకిలల్తో బలే ఉండేది. గుళ్లో ఎన్ని చిలకలుండేవో... పిచ్చుకలు! అవును మనం గమనించనే లేదు. అసలు కిచకిచమంటూ పిచ్చుకలు కనపడడం లేదు... వాటికోసం వెన్నుల్ని కుచ్చులా పూని గుమ్మాల ముందు కట్టడానికి ఎంత పోటీపడేవాళ్ళు! ఏమైపోయాయివన్నీ... తనే గానీ పవర్లో లేకుండా ఉండుంటే దీన్ని పెద్ద ఉద్యమం చేసేవాడు నిజమే... కానీ... యిప్పుడు!

నాలుగో తరగతి చదువుతున్న మనవరాలు వొచ్చి వొళ్లో కూర్చుంది. మంత్రి ఆ పిల్లని పొదువుకొని ముద్దు పెట్టుకున్నాడు. ఆ పిల్ల టీపాయి మీదున్న పేపరు వంక చూసి

'తాతయ్యా కొంగలన్నీ చచ్చిపోతాయట కదా!' అంది.

చిన్నగా నవ్వి 'ఎవరన్నార్రా' అన్నాడు.

'మరి మా స్కూల్లో స్వాతుంది కదా.. అదంటోంది.. కొంగల్ని చంపేస్తున్నారంట'

మంత్రి నవ్వుతూ 'అదేం కాదురా... అక్కడేదో ఫ్యాక్టరీ కడుతున్నారు. అందుకని అవి యింకో చోటికెళ్లిపోతాయంతే...'

'ఇంకో చోటికెందుకు అక్కడే వుండొచ్చు కదా!'

'అంటే మరి అక్కడ ఫాక్టరీ కడుతున్నారు కదా! ఫాక్టరీ కడితే మనకి బోల్డు వస్తువులొస్తాయి.. డబ్బులొస్తాయి...'

'అలా అయితే వస్తువులొద్దు... డబ్బులొద్దు కొంగలే కావాలి'

మరలాగయితే టీవీలు, బొమ్మలు ఏమీ వద్దా' అన్నాడు నవ్వుతూనే

ఆ పిల్ల కొంచెం ఆలోచించి

'అయితే మరి ఆ ఫాక్టరీని యింకో చోట కట్టొచ్చు కదా! కొంగలున్న చోటే ఎందుకు కట్టడం'

మంత్రికి నవ్వాగిపోయింది.

బూరయ్య వేసిన ప్రశ్న... సమాధానం చెప్పలేని ప్రశ్న... చెప్పకూడని ప్రశ్న...

గన్ మేన్ వచ్చి శాల్యూట్ చేసాడు. చేసి ఎమ్మెల్యే వెంకటరావు యింకా కొంతమంది వచ్చి ఉన్నారని చెప్పాడు. మంత్రి మనవరాల్ని లోపలికి వెళ్లమని చెప్పి ముందు హాల్లోకి వచ్చాడు. గదిలో దగ్గర దగ్గర ఇరవై మంది వరకూ కూర్చున్నారు. అందరూ ప్రాజెక్టు గురించీ పక్షుల గురించీ మాట్లాడుతున్నారు. చిత్రం!

నిన్నటి వరకూ భూముల ధరలు, కాంట్రాక్టు బేరాల గురించీ మాట్లాడినవాళ్లు యివేళ పక్షుల గురించి మాట్లాడక తప్పడం లేదు.

మంత్రిని చూడగానే అందరూ లేచి నమస్తేలు చెప్పారు.

మంత్రి కూర్చుని,

'ఏంటి వెంకటరావుగారూ... ఎలా ఉంది పరిస్థితి?' అడిగాడు.

'ఏముంది సార్... అంతా గోలగోల గానే ఉందండి... బూరయ్యగారినీ, ఆ కుర్రాళ్లని వదిలేసారు. వాళ్ళేమో ఆ చెరువు దగ్గర నిరాహార దీక్షలు మొదలు పెట్టారు. ప్రతిరోజూ కనీసం వందమంది కూర్చుంటున్నారు. వూళ్లలో ఎవ్వరూ ఒప్పుకోవడం లేదండీ... ఇంకో చోట కట్టండి ప్రాజెక్టుని అనేదే వాళ్ల గొడవ... ఆ కొంగలంటే వాళ్లకి దేవుళ్లే... పైగా సార్ మాయింట్లో వాళ్లు కూడా అంటున్నారండీ... బూరయ్యగారన్నదాంట్లో తప్పేంవుంది. ప్రాజెక్టు కట్టాలీ అంటే యింకో చోట ఎందుకు కట్టకూడదు? అని'

'అటు రాజమండ్రి నించి హైదరాబాద్ వరకూ పెద్ద పెద్ద వాళ్లంతా విమర్శిస్తున్నారు సార్...' అన్నాడు మరో వ్యక్తి

'సర్లేవయ్యా... మనం బలవంతంగా పోతే పరిస్థితి ఏంటి?'

వెంకటరావు కళ్లు మిటకరించాడు.

'లేద్సార్ ఆ వూరి కుర్రాళ్లు పగలూ రాత్రి లేకుండా అక్కడ కాపలా ఉంటున్నారండీ'

నవ్వాడు మంత్రి..

'కాపలా ఉంటే... పోలీసుల్ని అడ్డుకుంటారా? యిలా పక్షులనీ, చెట్లనీ.. కొండలనీ... అడవులనీ నాశనం చైకూడదు... కొట్టకూడదు అనుకుంటే మనం అభివృద్ధి సాధించడం ఎలా?'

తెల్లబట్టలు వేసుకున్న కార్యదర్శి వచ్చి “సార్.. సీఎం ఆఫీసునించి ఫోన్' అన్నాడు. మంత్రి లేచి గబగబా పక్క గదిలోకి వెళ్లాడు.

## 6

ఎక్కణ్ణించి వచ్చిందో అది కంది మొక్క మీద వాలింది. చిన్న పిల్లాడి పిడికలంతుంది. ముదురు బూడిద రంగు మెడ చుట్టూ ఆభరణంలా ఎర్రిన గీత. నెత్తి మీద కిరీటంలా ఈకలు. వాలి గబగబా మెడ అటూ యిటూ తిప్పింది. కొమ్మమీద ముక్కుతో పొడిచింది. రెండు అడుగులు పక్కకి వేసి మళ్ళీ పైకెగిరిపోయింది.



**చిన్న పిల్లాడి పిడికలంతుంది. ముదురు బూడిద రంగు మెడ చుట్టూ ఆభరణంలా ఎర్రిన గీత. నెత్తి మీద కిరీటంలా ఈకలు. వాలి గబగబా మెడ అటూ యిటూ తిప్పింది. కొమ్మ మీద ముక్కుతో పొడిచింది. రెండు అడుగులు పక్కకి వేసి మళ్ళీ పైకెగిరిపోయింది.**

బూరయ్య నవ్వుకున్నాడు. అది ఎగిరిన వేపే చూసాడు. కరిగిపోయి నట్టు మాయమైపోయింది. ఎంత అందమైన పక్షి. యింత చిన్న పిట్టకి ఈ భూగోళంలో జాగా లేకుండా చైడం... రాశి ఉసిరి చెట్టు కింద నిలబడి పొదల్లో ముత్యాల్లా మెరుస్తున్న ఉసిరికాయల్ని చూసి వొంగి ఒక ఉసిరికాయని తీసి కొరికాడు. అది బాగా పండిన కాయ. చిత్రమైన పులుపు.. తీపి... నోట్లోంచి నీళ్ళూరి పోతుండగా చిన్న పిల్లాడిలా మరికొన్ని కాయల్ని ఏరాడు.

'చంటి కుర్రాళ్లా ఉసిరికాయలేర్తున్నారేటి మాస్టారూ...' అంటూ వచ్చాడు ఆదినారాయణ. అతనితో పాటు యింకా కొంతమంది కుర్రాళ్లు.

'యివి తిని చూడ్రా బాబూ భలే ఉన్నాయి' అంటూ దోసిట్లోని కాయల్ని వాళ్లకి యిచ్చాడు.

ఆ చెట్టుకిందనే కూర్చున్నారందరూ.

'మాస్టారూ.. ఈ ప్రాజెక్టు ఆగిపోయినట్టేనంటారా'అన్నాడు సోమరాజు.

'ప్రస్తుతానికయితే అంతే కానీ ఏం చెప్పగలం... ప్రభుత్వం తల్చుకుంటే...'

'అంతేనండీ... ఈ ప్రాజెక్టు వల్ల మంత్రికి పాతిక ముప్పై కోట్ల వరకూ వస్తాయటండీ.. పైగా కాంట్రాక్టర్లు తొందర పెడుతున్నారటండీ...'

బూరయ్య నవ్వాడు. 'మన దురదృష్టమేమంటే యిలాంటి బల్లకింద వ్యవహారాలు పెద్ద పెద్ద ఆర్థిక విషయాల్ని నిర్దేశించడం... ఎవడో ఒక చోట ఫాక్టరీ కడతానంటే వూళ్లకి వూళ్లు ఖాళీ చేయించి స్థలాల్ని అప్పనంగా ఇచ్చేడం, వాడికోసం చట్టాల్ని మార్చుకోవడం.. స్థానిక ప్రజల్ని బలిపశువుల్ని చైడం, నిర్వాసితులు మనుషులే కాదన్నట్టూ, వాళ్లనేదో ద్రోహులుగా చూట్టం... యిదంతా దేనికోసం అనిపిస్తుంది'.

చంద్రరావు అనే కుర్రాడు అడిగాడు 'మరైతే మాస్టారు... అభివృద్ధి జరగడం ఎలా? మన దేశం సూపర్ పవర్‌గా ఎదగాలి కదా!'

'చాలా సులువుగా అడిగేశావు గానీ దీనికి సమాధానం చెప్పడం కష్టమయ్యా... యిందులో ఉన్న సమస్యేమిటంటే మనకి దేన్ని అభివృద్ధీ అంటున్నారో.. దేన్ని అభివృద్ధి అని నమ్మమంటున్నారో అది మనకి అభివృద్ధిగా కనిపిస్తోందా? అది మన్ని చేస్తున్న అభివృద్ధి ఏమిటి? అది కాక మరి ప్రకృతిని నాశనం చేయడం సంగతేంటి? దీనికి ప్రత్యామ్నాయం లేదా?'

'అంటే కొన్ని నష్టాలేవో ఉంటాయని లాభాల్ని ఎలా వొదులుకుంటామండీ?'

'నిజమే సామాన్యంగా చూస్తే అది తెలివి తక్కువ పనే. కానీ ఎవరికి లాభాలూ... ఎవరికి నష్టాలూ... అనేది కూడా చూడాలి కదా? రెండోది

కూర్చున్న కొమ్మని నరుక్కోవడంలో లాభాలెక్కువున్నాయా... నష్టాలెక్కు వున్నాయా..? యిప్పుడు కొల్లేరు గొడవుంది. దాన్నంతా ఆక్రమణలు చేసి కొంతమంది చాలా అభివృద్ధి చెందారు. కానీ ఆ కొద్దిమంది కోసం ఎన్ని వేలమంది నష్టపోయారు?ఎంత పర్యావరణం నాశనం అయింది. యిప్పుడేమో అమాయకుల్లా పక్షులు ముఖ్యమా... మనుషులు ముఖ్యమా... అంటే... యిదంతా నష్టం కాదా? ఈ కొద్దిమంది అభివృద్ధి కోసం యింత నష్టాన్ని భరించడం లాభమా? మానవుడి అవసరాల్ని తీర్చగలిగే శక్తి ప్రకృతికి వుంది కానీ అత్యాశల్ని కాదు అన్నాడు గాంధీజీ. అత్యాశకి మరో పేరే అభివృద్ధా?' ఆ వ్యక్తి మాట్లాడలేదు.

బూరయ్య కూడా మౌనంగా ఆలోచిస్తూ ఉండిపోయాడు. అరవై ఏళ్లు పైబడిన వ్యక్తి అతను. ఎప్పుడూ తెల్లబట్టలు వేసుకుని ఉంటాడు. అవి చాగల్నాడు ఎర్రమట్టిని అంటించుకుని ఉంటాయి. బక్కగానే ఉంటాడు. కానీ శక్తివంతంగా ఉంటాడు. నల్లని అతని శరీరంమీద తెల్లవెంట్రుకలు గుబురుగా ఉంటాయి. అతని ముఖం చిత్రంగా పసిపాపలా ఉంటుంది. మీసాలు గొరిగేయడం వల్ల పై పెదవి వెడల్పుగా కనిపిస్తుంది. పెద్దదిగా వున్న ముక్కు వెళ్లాడుతున్నట్టు ఉంటుంది. కనుబొమలు కూడా నెరిసిపోవడంతో వయసుకన్నా వృద్ధుడిలా ఉంటాడు.



నుదురు మీద అనేక ముడతలుపడ్డాయి. చిబుకం సన్నగా వొణికింది. చాలా చిన్న గొంతుతో తనతో తానే మాట్లాడుకుంటున్నట్టుగా అన్నాడు. 'యిది లాభం.. యిది నష్టం అనే లెక్క తప్పేమో అని నాకనిపిస్తుంది. ఈ ప్రాజెక్టు గురించి మంత్రులతోనీ కలెక్టరుతోనీ మాట్లాడినప్పుడు వాళ్లేమన్నారో తెల్సా ఏంటండీ పిచ్చోళ్ళా మాట్లాడతారు. దిక్కుమాలిన పక్షుల కోసం మన అభివృద్ధిని ఆపుకుంటామా? అసలు ఆ పక్షులు ఉంటే ఎవరికి లాభం లేకపోతే ఎవరికి నష్టం?ఈ మాటలు నన్ను ఎంత భయపెడుతున్నాయో తెల్సా... యివాళ పక్షుల్ని గురించి అన్నారు- కొండల్ని గురించి అన్నారు- జంతువుల గురించి అన్నారు- చెట్ల గురించి అన్నారు. రేపు కొంతమంది మనుషులు..కొన్ని జాతులు.. కొన్ని దేశాల ప్రజలు లేకపోతే నష్టం ఏమిటి? అని అనుకోలేరా? ఈ ప్రశ్న... ఈ మైండ్ సెట్ ఎంత భయంకరమైందో వూహిస్తుంటే వెన్ను జలదరిస్తోంది. యిప్పటికే బతకడానికి దారే లేకుండా ఎంత మందిని ఎన్ని లక్షల మందిని వీధిన పడేలేదు? యిదుగో ఈ జాతి వల్ల మనకి లాభంలేదని అనుకొని దాన్ని నాశనం చేసేస్తే...అప్పుడు కూడా అవునండీ అభివృద్ధి కోసం కొన్ని నష్టాల్ని భరించాలి అంటూ వేదాంతం చెప్పి బాంబుల్తో కొన్ని జాతుల మానవుల్ని నాశనం చేసేస్తే...'

సన్నగా కంపిస్తున్నట్టున్న అతని గొంతు భీతావహంగా వినిపించింది.

'ఒక చిత్రమైన విషయం గమనించారా? ఎక్కువ మంది మనుషుల్ని ఒకేసారి చంపేడానికి, పెద్ద పెద్ద కొండల్నీ పేల్చి పారేయడానికి, మహా వృక్షాలని సులువుగా నరికిపారేయడానికి ఆయుధాల్ని తయారుచేసిన వాళ్లని మనం పెద్ద శాస్త్రజ్ఞులంటున్నాం. రాయి విసిరిన వాడి కన్నా కత్తి పట్టినవాడు నాగరికుడు.. వాడికన్నా విల్లు పట్టినవాడు.. తుపాకి పట్టినవాడు- ఫిరంగుల్ని పట్టినవాడు- క్షిపణులు- విమానాలు- ఆటంబాంబులు... ఈ చివ్వరివాడు అందరికన్నా నాగరికుడు. యిది ఎంత భయానకమైన హాస్యమో చూడండి... అభివృద్ధి కూడా అంతేనేమో!'

ఎవ్వరూ మాట్లాడలేదు. చాలాసేపటి తరువాత చంద్రరావు లేస్తూ 'నేను వెళ్తానండీ మన సెక్రటరీగారు కబురు పెట్టారు. ఒకసారి కలవాలి' అన్నాడు. 'ఏంటట' అన్నాడు ఆదినారాయణ.

'అదే మా పేటలో వాళ్లకి ఇళ్ల స్థలాలుకావాలని పెట్టుకున్నాంకదా. అటు వూరి మొదట్లో చెరువు అవతల పోరంబోకులో స్థలాలిస్తామంటున్నారు'.

'చెరువు అవతల స్థలమా? అదెలా యిస్తారు'.

'ఏ'...

'ఏ... ఏట్రా బాబూ.. ఆ పక్కనే కదా చెరువూ... తోపూ వున్నది' అని బూరయ్యతో 'మాస్టారూ... మంత్రిగారు తిరగేసి కొడుతున్నారండీ' అన్నాడు ఆదినారాయణ.

## 7

'పర్యావరణం పేరుతో అభివృద్ధిని అడ్డుకోవడం తగదు' పేపరు చదివి పక్కన పెడ్తూ "బాగా కవర్ చేశావయ్యా" అన్నాడు రామచంద్రరావు.

అతని ఎదురుగా కూర్చున్న విలేఖరి నవ్వుతూ... తలవూపుతూ... "ఇంకా రాసాను గానండీ మావాళ్లు కట్ చేస్సారండీ" అన్నాడు.

"సీఎంగారు ఈ విషయంలో మొండిగా ఉన్నారయ్యా... మీకు చేతకాకపోతే ఆ ఫైళ్లు అక్కడ పారేసి పొమ్మని కోప్పడ్డాడు కూడానీ... పక్షుల గురించి.. పూచిక పుల్లల గురించీ ఆలోచిస్తా కూచుంటే ఎలా అంటాడాయన".

"నిజమేనండీ... ఒకచోట ప్రాజెక్టు కట్టాలి అంటే జనాన్ని అక్కడినించి వెళ్లగొట్టడంలా? యింకా పక్షులు నయమండీ.. వాటికి రెక్కలున్నాయి. ఎక్కడికైనా ఎగిరిపోగలవు కదా!" నవ్వాడు విలేఖరి.

తన వూగుడు కుర్చీలో వూగుతూ కొంచెం చిరాగ్గా చూసాడు రామచంద్రరావు. విలేఖరి మాటల్లో వ్యంగం ఏమీ లేదు. స్పటిక స్పష్టంగా వున్న విషయం చెప్తున్నాడు.

"యింతకీ బూరయ్య గారేమంటాడు..." బూరయ్యని గారు అనడం అతనికి చిరాగ్గా ఉంది. కానీ అనుకోకుండా అలా వచ్చేస్తోంది.

'ఆయన్దేముందండీ ఆయనో వెర్రోడు... చెట్లూ... పక్షులూ... పోతాయో... అంటాడు. ఆయన్తో కాసేపు మాట్లాడితే మనగ్గూడా అలానే అనిపిస్తుందిలెండి. కానీ డబ్బులురావు కదా. బంగారు గుడ్డు పెడుతోంది కదా అని బాతు పొట్ట కోసేయకూడదూ అంటాడాయన. పొట్టలో బంగార ముందని తెలిసాకా ఆగడమెట్టా..అనీ... కానీ సార్.. ఆ చుట్టుపక్కల మాత్రం ఆయనకున్న ఫాలోయింగ్ విపరీతమండి".

గార్డు వచ్చి టేబుల్ మీద కోసిన యాపిల్ ముక్కలు, ద్రాక్షపళ్లు, రెండు గ్లాసుల్తో బత్తాయి రసం పెట్టాడు. విలేఖరి బత్తాయి రసం కొద్దిగా గుటక వేసి ఒక యాపిల్ ముక్క తింటూ,

> ***గట్టు దిగి గబగబా నడుచుకుంటూ వెళ్ళి- ఒక చింతచెట్టు మానుని కావలించుకుని ఉండిపోయాడు. ఒక్క క్షణం ఏం జరిగిందో అర్థం కాలేదు ఎవరికీ... మరుక్షణంలో... వూరి జనం అందరూ తోపులోకి పరుగులు తీసి... తలో చెట్టునీ కావలించుకుని ఉండిపోయారు.***

"యిప్పుడు ఆ చెరువు పక్క భూమి ఎస్సీలకిస్తున్నారు కదండీ... బహుశా దానిమీద గింజుకుంటున్నారండీ వద్దన్లేరు... అవునన్లేరు..." అని నవ్వుతూ మళ్ళీ రసం గుటక వేసాడు.

రామచంద్రరావు లోలోపలే గర్వంగా నవ్వుకున్నాడు. ఇవ్వాళ... రేపు మహా అయితే ఒక ఏడాది దాకా ఆలోచించగలరు జనం. పది... పాతిక... వంద సంవత్సరాల తర్వాత కోసం ఇప్పట్నించే ఆలోచిస్తాం మనం... యిది వాళ్లకి అంతూ పట్టదూ... అవసరమూ ఉండదు... అనుకున్నాడు. "సరే అయితే రేపు పంపిణీ కార్యక్రమానికి వస్తారుగా" అన్నాడు వూగుతూ... 'వస్తాను సార్...' అంటూ విలేఖరి లేచి 'ఉంటాను సార్' అని బయటకు వెళ్లిపోయాడు.

ఆ రాత్రి రామచంద్రరావు పడుకోవడానికి సిద్ధమౌతుండగా జెడ్పీటీసీ ఎమ్మార్వోలు వచ్చి చల్లగా చెప్పారు. ఎస్సీ పేటలో జనం ఇళ్ల స్థలాలు వద్దంటున్నారనీ...

'నిజమా' అన్నాడు.

'అవును సార్... ఆ ప్రాంతం పక్షులు వచ్చే స్థలానికి దగ్గరగా ఉండటం వల్ల పక్షులకి ప్రమాదం కాబట్టి అక్కడ కాక యింకెక్కడయినా యిప్పించమని కాగితం కూడా రాసిచ్చారండీ...'

ఒక బూతు మాట విసిరాడు కోపంతో... వెంటే తగ్గి 'సర్లే... మనం ఏంచేస్తాం మీరెళ్లండి' అని వాళ్లని పంపించేసాడు.

## 8

రెండు పొక్లొయినర్లూ- పది పదిహేను లారీలు- కరెంటు రంపాలూ- గొడ్డళ్లూ లాంటి పనిముట్లు పట్టుకొని చెరువొడ్డుకి దిగిపోయారు కంట్రాక్టరు మనుషులు. వందమందికి పైగా పోలీసులు తుపాకులు పట్టుకుని కాపలాగా ఉన్నారు. ఊరంతా అగ్గి సెగ తగిలినట్టు కళవెళపోతోంది. ఆర్డీవో ఎమ్మార్వోలు సమీపంలో ఉన్న చెట్టు కింద బల్లలు కుర్చీలు వేసుకొని కూర్చున్నారు.

(మిగతా 29వ పేజీలో)

# హద్దు (11వ పేజీ తరువాయి)

ఈవేళ స్థలాన్ని స్వాధీనం చేసుకొని పని మొదలు పెడుతున్నారు.

బూరయ్య, ఆదినారాయణ, చంద్రరావు, సోమరాజు యింకా వూరి కుర్రాళ్లూ, పెద్దలూ అందరూ ఆర్డీవో దగ్గర నిలబడి వున్నారు. చుట్టుపక్కల వూళ్ల నించి జనం వస్తున్నారు. పోలీసులు వాళ్లని దగ్గరకెళ్లనివ్వకుండా ఆపేస్తున్నారు.

"యిది గవ్‌మెంటార్డర్ సర్... మేము చేయగలిగిందేమీ లేదు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ప్రాజెక్టు కట్టడానికి ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వం నిర్ణయించింది. మేం దాన్ని ఎగ్జిక్యూట్ చేస్తాం. అంతే" అంటున్నాడు ఆర్డీవో.

"అలాక్కాదు సార్... ఈ విషయం హైకోర్టులో ఉంది. కనీసం ఏదో ఒక నిర్ణయం వచ్చేవరకూ ఆగండి" అన్నాడు ఆదినారాయణ.

"అది మా చేతుల్లో లేదు. సరే... హైకోర్టులో ఉంటుంది... తరువాత సుప్రీం కోర్టు యిలా సాగుతూనే ఉంటుంది కదా. అయినా మనలో మాటగా చెప్తున్నాను. ఈ ప్రాజెక్టు ఆపడానికి మీరు చెప్తున్న అభ్యంతరాలేవీ సహేతుకంగా లేవు. అభివృద్ధి కార్యక్రమాల వల్ల కొంత నష్టం ఉండొచ్చు. కానీ అందుకని అభివృద్ధిని ఆపుకోలేం కదా. పిట్టలనీ... చెట్టులనీ, కొండలనీ, అడవులనీ చూసుకుంటే... మనం ఎన్నటికీ వెనకబడే ఉంటాం" ఆర్డీవో నవ్వాడు.

పక్కనున్న డిఎస్పీ కూడా నవ్వుతూ, "బూరయ్యగారూ మీరు పెద్ద వారు. యిలాంటి విషయాల్లో కుర్రాళ్లని రెచ్చగొట్టి తప్పుదారి పట్టించి లా అండార్డర్ ప్రాబ్లెం క్రియేట్ చైకండి" అన్నాడు.

ఆర్డీవో "ఏమైనా గానీ... ఒక్క విషయం సార్... మనం కొన్ని విషయాల్లో స్వార్థాన్ని వదిలిపెట్టి దేశం కోసం ఆలోచించాలి".

ఆదినారాయణకి వొళ్లు మండిపోయింది. అతడు ఆర్డీవో మాటల్ని ఆపేస్తూ ఉద్రేకంతో అన్నాడు. "ఎవరికి సార్ మీరు దేశం కోసం ఆలోచించాలనీ.. త్యాగాల గురించీ చెప్తున్నారు. ఆయనేం లచ్చలూ కోట్లూ సంపాదించి బిజినెస్‌లు చైడం లేదు. కాంట్రాక్టులూ చైడంలేదు. మంచీ మర్యాదా లేకుండా మాట్లాడకండి..."

డీఎస్పీ కళ్లెర్రజేస్తూ "చాలా ఎక్కువ మాట్లాడుతున్నావ్.. మిమ్మల్ని మాట్లాడమని పిల్లేదిక్కడికి చెప్పేది వినండి... వినేసి పొండి అంతే" అన్నాడు కరుగ్గా. ఆదినారాయణ పెదాలు కంపించాయి.

బూరయ్య అతని భుజం తడుతూ 'ఆదీ... ఉద్రేకపడకు...' అని ఆర్డీవోకీ డీఎస్పీకి నమస్కారం చేసాడు. దూరంగా ఉన్న జనాన్ని చూస్తూ కళ్లజోడు తీసి చొక్కాతో తుడుచుకుని మళ్లీ పెట్టుకుంటూ ఆర్డీవోతో "అసలీ మాటలనీ.. అభిప్రాయలనీ తీసుకొచ్చింది మీరు. మీకు అభిప్రాయాలతో పనేముంది. మీ ఆర్డర్స్ ముఖ్యం" అని నవ్వాడు. నవ్వి, 'మీతో చెప్పడం గానీ చర్చించడం గానీ చిరాగ్గా ఉంటుంది. అధికారులు మీరు... చెప్పడానికే తప్ప వినడానికి పుట్టలేదు మీరు' అని మళ్లీ నవ్వి 'కానీ ఒక నిర్ణయం చెప్పాలి...అది మీరు వినాలి తప్పదు. స్వార్థం వదిలి పెట్టి దేశం కోసం ఆలోచించాలా...చాలా చక్కగా చెప్పారు. మాకిందులో ఉన్న స్వార్థం ఏమిటో చెప్పండి. అయ్యా భూమి నాశనమైపోతోంది వొద్దూ...అన్నాం అది మా స్వార్థం...నీళ్లు నాశనమౌతున్నాయి వొద్దూ... అన్నాం అది మా స్వార్థం... పర్యావరణం నాశనమౌతోంది అన్నాం అది మా స్వార్థం...ఈ పాఠం కొత్తగా నేర్చుకోవాలి".

ఆర్డీవో ముఖం కందిపోయింది. మాడిపోయింది.

"అయినా ఈ గుణగణాల ప్రసక్తి అనవసరం. యిది మీరే వృధాగా ప్రస్తావించారు" అని జనం వంక చూస్తూ "కొన్ని వేల ఏళ్ల నించి యిక్కడ పక్షులు విడిది ఉంది. వేల సంవత్సరాలు మనుషులు వాటితో కలిసి జీవించారు. వాటిని కాపాడారు. వాటిని ప్రేమించారు. దీన్ని నాశనం చైకండీ.. ఇంకెక్కడైనా కట్టండి బాబూ ప్రాజెక్టుని అన్నాం మనం. దీని కోసం ఉద్యమం చైయాల్సి వచ్చింది. అరెస్టులు కావాల్సి వచ్చింది. లాఠీ దెబ్బలు... కేసులు... ఏంటీ ఈ చిత్రం! వాళ్లు పీల్చేదీ మనం పీల్చేదీ ఒకటే గాలి. వాళ్లు తాగేదీ మనం తాగేదీ ఒకటే నీరు. వాళ్లు ఉండేదీ మనం ఉండేదీ ఒకటే నేల. ఈ నేలని ఈ ప్రకృతిని మరీ అంత పాడు చైడం మంచిది కాదూ అన్నందుకు మనం శత్రువులమైపోయాం. మన్ని ఓడించాలని వ్యూహాలూ... ఎత్తుగడలూ... బెదిరింపులు.. బుజ్జగింపులు... ఎందుకిదంతా? ఈ ప్రకృతి ధ్వంసమైతే నష్టం మనుషులందరిదీ కాదా? భూమి భరించలేనంత దారుణమైన అభివృద్ధిని సాధించి ఎందుకు భూమిని నాశనం చేస్తారు? 'అతి సర్వత్రా వర్జయేత్' అని మనిషి బతకడానికి వీల్లేనంత అభివృద్ధి కావాలా? మన తరువాత తరాలు ఈ భూమ్మీద బతకాల్సిన అవసరం లేదా? అభివృద్ధికి హద్దులుండొద్దా... ఏమైనా ఒకటి అర్థమవుతోంది. ఒక చెట్టుని కాపాడుకోవాలన్నా ఒక పిట్టని కాపాడుకోవాలన్నా మనుషులు మనుషులు కొట్లాడుకోవాలన్న మాట. మరి ఏం చేస్తాం"

అని ఆర్డీవో వేపు తిరిగి "మీరు ఆర్డర్లు ఫాలో అవుతారు. మరి మేము చైగలిగిందేముంది? ఒక్కటే మిగిలింది. ఈ చెట్లనీ... ఈ చిట్టడివినీ... మీరు నరికేయదల్చుకుంటే ముందు మమ్మల్ని నరికి ఆ పని చేయండి" అని-

అంతా నిశ్శబ్దమైపోగా- గట్టు దిగి గబగబా నడుచుకుంటూ వెళ్లి-
ఒక చింతచెట్టు మానుని కావలించుకుని ఉండిపోయాడు.
ఒక్క క్షణం ఏం జరిగిందో అర్థం కాలేదు ఎవరికీ...
మరుక్షణంలో...వూరి జనం అందరూ తోపులోకి పరుగులు తీసి...
తలో చెట్టునీ కావలించుకుని ఉండిపోయారు.

●




## వృద్ధాప్యంలో పదిమందికి తోడ్పడుతున్నారా?

జీవితంలో అరవైఏళ్ళు ఒక మైలు రాయి. ఒక ప్రశాంతచిత్తంతో బతికే సమయం. వృత్తి వ్యాపకాల్ని విరమించి విశ్రాంతినొందే సందర్భం. వృద్ధాప్యం సహజంగా, అనివార్యంగా తటస్థించిన సన్నివేశం. అయినా...కాలాన్ని కరిగించడం ఒక్కటే ధ్యేయం కాదు. జీవితం ముగిసిన సందర్భం అసలే కాదు. నిజానికి కాలాన్ని నవనవోన్మేషంగా ఉపయోగించుకునే వేళ ఇది. జీవనసంధ్యలో జీవితాన్ని మరింత ఉత్సాహంగా గడపటం సాధ్యమే. సాధ్యమేనని నిరూపిస్తున్న వారు మన చుట్టూరా ఎందరో వున్నారు. అందుకే ఉద్యోగ విరమణ చేశాక మీరేం చేస్తున్నారు? మీరు చేస్తున్న పనులు చుట్టూవున్న పదిమందికి ఉపకరిస్తున్నాయా? ఇతరులకు చేదోడు వాదోడుగా ఉంటున్నారా? పొద్దు గడపటానికి ఏదో ఒక పనిచేయడం మామూలే. కానీ మీరుచేసే పనులు ఇతరులకు ఎలా సహాయకారిగా వుంటున్నాయో ఆలోచించారా? కొన్నిసార్లు మాట సాయం కూడా గొప్ప మేలు చేస్తుంది. అందువల్ల మీరుచేసే పనులు, సేవా కార్యక్రమాలు సమాజంలో పదిమందికి ఎలా ఉప కరిస్తున్నాయో మాకు రాసి పంపించండి. మీ కుటుంబసభ్యులకైనా మీరు ఏ విధంగా తోడ్పడుతున్నారో రాయొచ్చు.

మీ అనుభవాల్ని ఈ 'జీవనసంధ్య' శీర్షికలో ప్రచురిస్తాం. ఎందుకంటే మీ అనుభవాలు అరవై ఏళ్ళు పైబడిన ఇతరులకుకూడా ఉపకరిస్తా యి. వృద్ధాప్యాన్ని బరువుగా, భారంగా కాకుండా ఆనందంగా, సృజనాత్మకంగా గడపటమెలాగో తెలుసుకుంటారు. కనుకనే అరవై ఏళ్ళు పై బడిన వారు ఇప్పుడు ఎలా గడుపుతున్నారో ఈ శీర్షికకు రాసి పంపించండి. మీరు ఒంటరిగా వుంటున్నా, మీ బిడ్డలవద్ద ఉన్నా లేక వృద్ధుల శరణాలయాల్లో వుంటున్నా మీరు ఎలా గడుపుతున్నారో రాసి పంపించండి.

మీ పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం మరవద్దు. మా చిరునామా:

**జీవనసంధ్య,**
**ఆదివారం వార్త, ఎడిటర్, వార్త,**
**లోయర్ టాంక్‌బండ్,**
**హైదరాబాద్ - 500 080**